నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఆల్విన్, సంజీవయ్యపార్కు సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సౌభాగ్యనగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్, కైలాష్ నగర్, సుభాష్‌నగర్, పాటిగడ్డ క్వార్టర్స్, నూర్‌బాగ్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఎఫ్‌సీఐ గోడౌన్ ఏరియా, పాటిగడ్డ రోడ్డు, నవాబ్ గల్లీ, పైగా ప్యాలెస్, రసూల్‌పురా సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

లాలాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లంబాడీ బస్తీ, కనకదుర్గా అపార్ట్‌మెంట్స్ నండే మార్కెట్, విజయ డెయిరీ, గరోండా అపార్ట్‌మెంట్, డేవిడ్ మెమోరియల్ కాలేజ్, నాగార్జుననగర్ షిరిడీ సాయినగర్, శ్రీనివాస అపార్ట్‌మెంట్స్ పార్కు, విద్యానికేతన్, సెయింట్ ఆన్స్ జూనియర్ కాలేజ్, సెయింట్ జూడేస్ కాలేజీ. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు డొమైనిక్ మోడల్ హైస్కూల్, పోచమ్మ టెంపుల్, సాయిసదన్ అపార్ట్‌మెంట్స్, నారాయణ జూనియర్ కాలేజ్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు వినోభానగర్, ఇందిరానగర్, లాలాపేట్, గణేష్ టెంపుల్, అండర్‌గ్రౌండ్ కేబుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

లాలాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ కోతలు

లాలాపేట: లాలాగూడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఇటీవల అప్రకటిత విద్యుత్ కోతలు తలెత్తుతున్నాయి. గత కొన్ని రోజుల నుంచి శాంతినగర్, లాలాగూడ తదితర ప్రాంతాల్లో ఒక ఫేజ్‌లో కరెంటు ఉంటే మరో ఫేజ్‌లో ఉండటం లేదు. దీంతో వర్క్‌ఫ్రమ్ హోమ్, కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లు, ఆన్‌లైన్ మీసేవా కేంద్రాల కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుందని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతుందని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటున్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.25, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 58, పందిరి బీర 45, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 40, గోకరకాయ 45, కీర 15, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 19, చామగడ్డ 50, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

దుప్పట్లు, చీరలు పంపిణీ

లాలాపేట: తబితా ఉమెన్ అండ్ చైల్డ్ సర్వీసు ఆశ్రమం, టీం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం లెప్రసీ బాధితులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సునీల్ ముదిరాజ్ మాట్లాడుతూ.. చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దుప్పట్లు, చీరలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం డైరెక్టర్ ఎలిషమ్మా, ప్రసిడెంట్ ఆచార్య ఆహరోన్ తీగుళ్ల, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్, అడ్వకేట్ శివ వరప్రసాద్, ప్రదీప్, మనవ్, యాదమ్మ, జయమ్మ, రోజా, రెబికా మల్లేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి

ముషీరాబాద్: మాదిగల చిరకాల కోరికైన ఎస్సీవర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం బిల్లును రాజ్యాంగ సవరణ చేసి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టకుండా కోర్టులు, కమిటీలు అంటూ.. కాలయాపన చేయడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఆగిపోయి 20 ఏళ్లవుతున్నా.. రాజకీయ పార్టీలు నాటి కాంగ్రెస్, నేటి బీజేపీని విమర్శించకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు ద్వారానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని నాటి నుంచి నేటి వరకు వివిధ సందర్భాల్లో చెప్పి మందకృష్ణ మాదిగ నేడు ఆ అంశాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై అనేక తీర్మానాలు చేసి వర్గీకరణ చేసుకునే వెసులుబాటు రాష్ట్రాలకు అప్పజెప్పాలనే మాదిరిగానే కేంద్రం కూడా కొనసాగించి రాష్ట్రాలకు అప్పజెప్పాలని గుర్తు చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లేష్, హుస్సేన్, చాప కృష్ణ, గుడ్ల మోహన్‌రావు, రాజేష్‌కన్నా, కొల్లూరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం


పిల్లలతో సునిత (ఫైల్)

కాచిగూడ: భర్తతో గొడవపడి ఇంట్లో నుంచి పిల్లలతో కలిసి వెళ్లిన తల్లి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన సునిత (39) భర్తతో గొడవపడి గాంధీనగర్ లంకబస్తీలో నివసిస్తున్న తమ్ముడి వద్దకు వచ్చింది. సునిత దంపతులకు చైత్ర (11), త్రిలోచన్ (9), మానిష్ (7) సంతానం. కాగా ఈనెల 9న తమ్ముడి ఇంటి నుంచి పిల్లలతో కలిసి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆమె గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డెక్కితే బీభత్సమే!

సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో పశువుల సంచారంతో ప్రజలు, వ్యాపారస్తులు ఇబ్బంది పడుతున్నారు. మూగజీవాల సంచారం కారణంగా ఇటు వ్యాపారస్తులు, అటు కొనుగోలుకు వచ్చే ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీకావు. పశువుల సంచారాన్ని అరికట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎప్పుడు సమస్య ఉత్పన్నమైనప్పుడు తప్ప వీటి నియంత్రణ విషయంలో సంబంధిత విభాగం యంత్రాంగం స్పందిస్తున్న తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. –బన్సీలాల్‌పేట్

- మోండా మార్కెట్‌లో పశువుల సంచారం
- భయాందోళనలో ప్రజలు, వ్యాపారులు
- దృష్టి సారించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు

ట్రాఫిక్‌కు సైతం అంతరాయం..

మార్కెట్‌తో పాటు రోడ్లపై కూడా పశువులు తిష్ట వేస్తుండటంతో నిత్యం ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ జామ్ సమస్య సైతం తలెత్తుతోంది. పశువుల సంచారంతో మార్కెట్‌లో జరిగే ప్రమాదాలను పట్టించుకునేనాథుడే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కసారిగా పశువులు మార్కెట్‌లోకి ప్రవేశించి కొన్ని సందర్భాల్లో నానా బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ సందర్భంగా ఎవరు ఎక్కడ గాయపడుతారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంటుంది. సదరు పశువుల యజమానులు యథేచ్ఛగా పశువులను మార్కెట్‌లో వదిలేస్తుండటంతో అవి అక్కడ కూరగాయలు ఇతరత్రా వస్తువులు తింటుంటాయి. గతంలో ఓ ఆవు ఓ వ్యక్తి పొడవడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. ఎప్పుడంటే అప్పుడు పశువుల మార్కెట్‌లోకి వచ్చి బీభత్సం సృష్టిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయని పలువురు సాక్షితో వాపోయారు. పశువులు కొన్ని సందర్భాల్లో రోడ్లపైనే తిష్ట వేస్తున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులకు ఆదాయంపై ఉన్న శ్రద్ధ ఇక్కడ సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడంతో పాటు వ్యాపారస్తులకు, ప్రజలకు రక్షణ విషయంలో ఎలాంటి శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దృష్టి సారిస్తే సమస్యకు పరిష్కారం..

మోండా మార్కెట్ విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు నిర్లక్ష్యం బాధ్యతారాహిత్యంగా ఉంటున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఓ వైపు పశువుల సంచారం మరో వైపు సదుపాయాలు, సౌకర్యాల లేమీ వ్యాపారస్తులు, ప్రజలకు గుదిబండగా మారాయి. పశువుల సంచారాన్ని అరికట్టడానికి మార్కెట్‌కు అన్ని వైపులా గేట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గేట్ల ఏర్పాటుతో కొంత వరకు పశువులు సంచారం తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు. పశువుల సంచారాన్ని అరికట్టాలని వ్యాపారస్తులు, ప్రజలు జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల పశువుల సంచారం విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా మోండా మార్కెట్ చౌరస్తా, ఇస్లామియా స్కూల్, అజంతా స్వీట్ హౌస్, గాస్ మండి నుంచి సిటీలైట్ హోటల్ వరకు రోడ్లపై పశువులు తిష్ట వేస్తున్నాయి. అదే విధంగా మోండా మార్కెట్ వెనుక భాగం, షోలాపూర్ స్వీట్‌హౌస్, రాజేశ్వర్ థియేటర్ లైన్ మోండా రోడ్లలో పశువులు పెద్ద ఎత్తున సంచరిస్తున్నాయి. దీంతో ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే వాహనచోదకులతో పాటు పాదచారులు, వ్యాపారస్తులు ఎప్పుడు ఎటు నుంచి ప్రమాదం దూసుకొస్తోందో అని బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు.


మోండా మార్కెట్ రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక నోములు

లాలాపేట: సంక్రాంతి వేడుకల్లో భాగంగా లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లాలాపేటలోని సంఘం భవనంలో సామూహిక నోములు కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో ఆర్యవైశ్య కుటుంబాలు పాల్గొని కైలాసగిరి నోము, చెరుకు, పసుపు తోట, బృందావనం నోములను నోముకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. సంక్రాంతి పండగను ఆధ్యాత్మికంగా జరుపుకోవడంతో పాటు చేతికొచ్చిన పంటకు పూజలు చేయడం, నోముకోడం అనేది ఆచారంగా వస్తుందన్నారు. పిల్లాపాపలు, సుఖసంతోషాలతో అందరూ ఆనందంగా ఆరోగ్యంగా ఉండాలని ఈ సామూహిక నోముల ద్వారా కోరుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములు గుప్తా, శ్రీనివాస్ గుప్తా, సాంబశివ గుప్తా, భాస్కర్ గుప్తా, వీణ, శ్రీదేవి,ఉప్పల లక్ష్మీ, స్వాతి, శ్రీలత పాల్గొన్నారు.


సామూహిక వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్య సభ్యులు

శ్రీకృష్ణ గోశాలలో ప్రత్యేక పూజలు

బంజారాహిల్స్: అయోధ్యలో 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా వాడవాడలా రామనామ స్మరణ మార్మోగింది. బంజారాహిల్స్ రోడ్‌నెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ అయ్యప్పస్వామి దేవాలయం గోశాల ప్రాంగణంలో హనుమాన్ జన్మోత్సవ్ సమితి ఆధ్వర్యంలో రేయింబవళ్లు రామనామ స్మరణ భజన కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సమితి చీఫ్ ఆర్గనైజర్ సతీష్‌కుమార్ జాజు, ఆర్గనైజర్లు ప్రకాష్‌చంద్ర గర్గ్, అజయ్ విజయవర్గీ, జస్మత్‌బాయ్ పటేల్, రాకేష్ అగర్వాల్, పవన్ బన్సల్, దేవేంద్ర జవార్, సురేంద్ర అగర్వాల్, రమేష్ అగర్వాల్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. శ్రీరామ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా వారం రోజుల పాటు భజనలు, అఖండ రామనామ సంకీర్తన ఈ నెల 22 వరకు కొనసాగుతాయన్నారు. రోజూ మధ్యాహ్నం హారతి, రాత్రి మహాహారతి కార్యక్రమం ఉంటుందన్నారు. శ్రీ కృష్ణ గోశాల ఆవరణలో ఈ వేడుక అత్యంత ఆనందకరంగా ఉందని వారు తెలిపారు. ఈ వేడుకతో స్థానికంగా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. వందలాదిగా భక్తులు ఈ భజనల్లో పాల్గొని రామనామస్మరణతో ఉప్పొంగిపోతున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సనత్‌నగర్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ గంగాధర్ వివరాల ప్రకారం..బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతంలో ఈ నెల 13న ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న పరిశీలించగా అప్పటికే మృతి చెందిట్లు నిర్ధారించారు. మృతుడు శ్యాంలాల్ బిల్డింగ్ ప్రాంతంలో భిక్షాటన చేస్తుండేవాడని స్థానికులు పేర్కొన్నారు.

వీఎస్‌టీ వర్కర్స్ సంక్షేమానికి కృషి చేస్తా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాజిద్ సుల్తానా టూబాకో (వీఎస్‌టీ) వర్కర్స్ సంక్షేమం కోసం తన శక్తివంచన లేకుండా కృషిచేస్తానని వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ కేక్‌ను కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. చరిత్రలో కనివినీ ఎరగని విధంగా వర్కర్స్ అభివృద్ధి కోసం అనేక అగ్రిమెంట్లు చేశామన్నారు. స్వర్గీయ మాజీ మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి సహకారంతో వర్కర్లకు అన్ని విధాల భరోసా కల్పించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి అయిలి ప్రభాకర్, ఆఫీస్ బేరర్స్ బాబ్జి, రవియాదవ్, నరేందర్‌గౌడ్, రణధీర్‌రెడ్డి, మధు, సత్యనారాయణ, మల్లేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

- ముగిసిన సంక్రాంతి సంబరాలు
- ఆకట్టుకున్న ముగ్గులు, అలరించిన ఆటాపాటలు


గొబ్బెమ్మలకు పూజ చేస్తున్న దృశ్యం

పట్నానికి పల్లె సొగసులు!


గాలి పటం ఎగరవేస్తున్న బీజేపీ సీనియర్ నేత లింగంపల్లి నర్సింగరావు


ఇంజినీర్స్ కాలనీ సాయితేజ టవర్స్‌లో సంక్రాంతి వేడుకల్లో మహిళలు

సనత్‌నగర్: నగరానికి పల్లె సొగసులు వచ్చాయా..అన్నట్లుగా సోమ, మంగళ వారాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఎటు చూసినా పండుగ ఉత్సాహమే ఉరకలేసింది. ప్రతి ఇంటా పిండి వంటలు ఘుమఘుమలాడాయి. అపార్ట్‌మెంట్ల వారీగా కలిసికట్టుగా తనివితీరా పండుగ వేడుకలను నిర్వహించుకున్నారు. ఊళ్లకు వెళ్లలేకపోయామన్న బాధను మరిచి పండుగ మూడు రోజులూ ఆనందోత్సాహాలతో గడిపారు. అమీర్‌పేట్, సనత్‌నగర్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీల ప్రజలు సంక్రాంతి ఉత్సవాల్లో మునిగితేలారు. కొందరు కుటుంబ సమేతంగా నగరంలో పల్లెగా చెప్పుకునే శిల్పారామం బాటపట్టి అక్కడ వేడుకలను జరుపుకున్నారు. పండుగనాడు దేవాలయాలు ఆధ్యాత్మిక శోభతో అలరారాయి. సనత్‌నగర్ హనుమాన్‌దేవస్థానం, సంజీవరెడ్డినగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం, ఈఎస్ఐ చౌరస్తాలోని విజయలక్ష్మి దేవాలయం తదితర ఆలయాల్లో భక్తులు పండుగ వేళ ప్రత్యేక పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సంక్రాంతికి పెద్ద ఎత్తున జనం తమ సొంతూళ్లకు వెళ్లడంతో నగర వీధులన్నీ వెలవెలబోయాయి. పిల్లలు, యువకులు, పెద్దలు అనే తారతమ్యం లేకుండా గాలి పటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. నింగిలో గాలిపటాలతో పోటీ పడ్డారు. బీకేగూడలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మహేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నర్సింగరావు, హృషీకేశవ, శ్రీనివాసరావు, సుమన్, కుషల్, రమేష్‌యాదవ శివప్రసాద్, రాహుల్, సాయి పాల్గొన్నారు.

తార్నాక డివిజన్‌లో..

లాలాపేట: సంక్రాంతి సంబరాలను తార్నాక ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. మహిళలందరూ ఇళ్ల ముందు రంగు రంగుల రంగవల్లులు తీర్చిదిద్ది అందులో గొబ్బెమ్మలు పెట్టి పూజ చేశారు. సంక్రాంతి బొమ్మల కొలువు, ఆటా పాటలతో ఆనందంగా గడిపారు. మరో వైపు ఇంటి దాబాలపై నుంచి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ గాలిపటాలు ఎగరవేస్తూ డీజే పాటలతో సందడి చేశారు.


సంక్రాంతి బొమ్మల కొలువులో మహిళలు


హనుమాన్ దేవాలయం శివాలయంలో గాలిపటాలతో అలంకరించిన దృశ్యం


లాలాపేటలో..

ఘనంగా ఫ్యామిలీ బ్లెస్సింగ్ మీటింగ్


డాక్టర్ ఆనంద స్టిరాతో తార్నాక క్రైస్తవులు

లాలాపేట: మినిస్ట్రీ ఆఫ్ జీజస్ (ఎంఓజీ) ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్‌లోని వైఎంసీఏ హాల్లో ఫ్యామిలీ బ్లెస్సింగ్ మీటింగ్ ఘనంగా జరిగింది. తమిళనాడు తిరుచ్చీకి చెందిన ఎంఓజీ ప్రసంగీకులు పాస్టర్ డాక్టర్ ఆనంద స్టిరా, మార్గరేట్ స్టిరా హాజరై ప్రత్యేక సందేశాన్ని అందించారు. అనంతరం డాక్టర్ ఆనంద స్టిరా కుటుంబాలను బ్లెస్ చేస్తూ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న మార్క్, ప్రదీప్, మోజెస్, అమీత్‌జాన్‌తో పాటు తార్నాకకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది


నగదును అందజేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

అమీర్‌పేట: ప్రమాదానికి గురై స్పృహ కోల్పోయిన వ్యక్తికి చికిత్స అందించి అతడి వద్ద ఉన్న నగదును బంధువులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నారు 108 సిబ్బంది. ఎర్రగడ్డ బ్రిడ్జిపై బైక్‌పై వెళ్తున్న తిరుపతయ్య అనే వ్యక్తి అదుపుతప్పి పడిపోయాడు. సమాచారం అందుకున్న అమీర్‌పేట 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన తిరుపతయ్యకు ప్రాథమిక చికిత్స అందిస్తూ సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. స్పృహలో లేని తిరుపతయ్య వద్ద రూ.68,500 నగదును గుర్తించారు. నగదుతో పాటు మొబైల్ ఫోన్, బైక్ తాళం అక్కడికి చేరుకున్న బంధువులకు అప్పగించిన 108 సిబ్బంది ఎస్.వెంకటేష్, వెంకటరమణలను స్థానికులు ప్రశంసించారు.

మహంకాళి దేవాలయంలో స్వచ్ఛతీర్థ కార్యక్రమం


స్వచ్ఛతీర్థ కార్యక్రమంలో పాల్గొన్న సుచిత్రశ్రీకాంత్

బన్సీలాల్‌పేట్: చరిత్రాత్మకమైన ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో మంగళవారం స్వచ్ఛతీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయాలు, తీర్థక్షేత్రాల పరిశుభ్రత కోసం ప్రధాని మోదీ పిలుపు మేరకు స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ ఆధ్వర్యంలో దేవాలయం ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దేవాలయంలో సేవ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, ప్రతాప్, నరేష్, దయానంద్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్ యాదవ్, శ్రీధర్, ధన్‌రాజ్, రమేష్ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ: ముగ్గురి అరెస్టు

సనత్‌నగర్: ఇరువర్గాల ఘర్షణలో కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్న ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పురేందర్ రెడ్డి కథనం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం బోరబండ, రామారావునగర్ సమీపంలోని హరినగర్‌లో గాలిపటాల కొనుగోలు సమయంలో కొందరు యువకులు కింద ఉమ్మగా హరినగర్ బస్తీకి చెందిన కొందరు ఇదేమిటని ప్రశ్నించడంతో ఇరువర్గాల నడుమ ఘర్షణ చోటు చేసుకుంది. పెద్ద సంఖ్యలో బస్తీకి చెందిన మహిళలు గుమిగూడటంతో గొడవకు దిగిన యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మళ్లీ రాత్రి పెద్ద సంఖ్యలో యువకులతో బస్తీకి చేరుకుని రాళ్లు, కర్రలతో బస్తీకి చెందిన కొందరిపై దాడికి పాల్పడ్డారు. బస్తీకి చెందిన వారు కూడా అప్రమత్తమై ఎదురుదాడి చేశారు. సంఘటనలో బస్తీకి చెందిన పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారంఅందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువకులను చెదరగొట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు మంగళవారం ముగ్గురిని అరెస్టు చేశారు.

మద్యం మత్తులో ఇంటిపై నుంచి జారిపడి యువకుడి మృతి

వెంగళరావునగర్: రక్షణ గోడలు లేకపోవడంతో అతిగా మద్యం సేవించడంతో కాలుజారి నాల్గో అంతస్తు నుంచి జారిపడి యువకుడు మృతిచెందిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్‌లో నివసించే కపిల్‌దేవ్ చౌహాన్ (23) అనే యువకుడు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా తన స్నేహితులు ఆకాశ్‌తో కలిసి మరో స్నేహితుడు జగదీష్ ఇంటికి వెళ్లి ఐదంతస్తుల బిల్డింగ్‌పై కూర్చుని మద్యం సేవించారు. ఈ బిల్డింగ్‌కు రెండు అంతస్తులు మెట్లకు పిట్ట గోడలు ఉన్నప్పటికీ ఆపైన ఎలాంటి రక్షణ గోడలు నిర్మించలేదు. పక్కనే ఓపెన్‌గా లిఫ్ట్ నిర్మించేందుకు ఖాళీని వదిలారు. వీరితో పాటుగా మరికొందరు కూడా మద్యం సేవించి గాలిపటాలు ఎగురవేశారు. సాయంత్రం దాదాపు 5 గంటల సమయంలో స్నేహితులతో కలిసి బిల్డింగ్‌పై నుంచి కపిల్‌దేవ్ కిందకు దిగాడు. వెంటనే ఏదో పని ఉందని చెప్పి మళ్లీ నాల్గో అంతస్తుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఉన్నట్టుండి కాలుజారి అక్కడ నుంచి లిఫ్ట్‌కోసం తీసిన గుంతలో జారి పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు చౌహాన్ సి. దేవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి రిమాండ్

రహమత్‌నగర్: మాజీ భార్య ప్రియుడిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని బోరబండ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలో పనిచేసే వినయ్‌కుమార్, గుంటూరు జిల్లాకు చెందిన భవ్యశ్రీలు గత కొంతకాలంగా సహజీవనం చేస్తున్నారు. కాగా వీరిద్దరు వివాహితులే. విజయవాడ కృష్ణ లంకకు చెందిన భవ్యశ్రీ మాజీ భర్త రవితేజ (34) వినయ్‌కుమార్‌ను హతమార్చాలని ఈనెల 11న రాత్రి వారు నివాసం ఉండే అపార్ట్‌మెంట్‌లోకి వచ్చి వినయ్‌కుమార్‌పై పెట్రోల్ పోసి చంపేందుకు యత్నించారు. ఇరుగుపొరుగు వారు అరుపులు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. అదేరోజు రాత్రి బాధితుడు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అపార్ట్‌మెంట్‌లోని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని డీఐ భూపాల్‌గౌడ్ తెలిపారు.